



స్టేషన్‌ఘన్‌పూర్ మండలం ఛాగల్‌లో వాగ్వాదం చేస్తున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు



జనగామ మండలం సిద్దెంకిలో అధికారుల వద్ద ఉన్న జాబితాను చించేస్తున్న గ్రామస్థులు

నిలదీతల పర్వం

- రెండో రోజూ రసాభాసగా గ్రామ సభలు
- జాబితాల్లో పేర్లు లేకపోవడంపై మండిపాటు
- అనర్హుల పేర్లు ఎలా వచ్చాయంటూ ఆగ్రహం
- పలుచోట్ల కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల ఘర్షణ

జనగామ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాల అమలు కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామ సభలు రసాభాసగా మారుతున్నాయి. అర్హుల ఎంపిక కోసం ఈనెల 21 నుంచి 24 వరకు గ్రామ సభలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా 21వ తేదీ నుంచి గ్రామ సభలు ప్రారంభమయ్యాయి. కాగా.. మొదటి రోజు జిల్లా వ్యాప్తంగా ఒకటి, రెండు చోట్ల స్వల్పంగా ప్రజల నుంచి ఆందోళన వ్యక్తమవగా, రెండో రోజూ చాలా చోట్ల నిరసనలు, నిలదీతల పర్వం కొనసాగింది. అర్హులైనప్పటికీ తమ పేరు జాబితాలో లేదంటూ కొందరు.. అనర్హుల పేర్లను జాబితాలో ఎలా చేర్చుతారంటూ మరికొందరు ఆందోళనలకు దిగారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు అన్ని మండలాల పరిధిలో గ్రామ సభలు నిర్వహిస్తున్న అధికారులకు ప్రజల నుంచి ప్రశ్నల వర్షం కురిసింది.

నిలదీతలు.. జాబితాల చించివేత

జిల్లాలో రెండో రోజూ గ్రామ సభలు గందరగోళంగా మారాయి. గ్రామ సభలు ప్రారంభమై దరఖాస్తు దారుల జాబితాను అధికారులు చదవడం ప్రారంభించగానే ప్రజల నుంచి నిరసనలు వ్యక్తమయ్యాయి. ప్రజాపాలనలో తాము దరఖాస్తు చేసుకున్నప్పటికీ తమ పేర్లు ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల జాబితాలో ఎందుకు రాలేదంటూ అధికారులను ప్రజలు ప్రశ్నించారు. జనగామ జిల్లాకేంద్రంలోని 13వ వార్డులో నిర్వహించిన వార్డు సభలో బీఆర్ఎస్ నాయకులు అధికారులను నిలదీశారు. దరఖాస్తు దారుల జాబితా కాకుండా అర్హుల జాబితా చదవాలని డిమాండ్ చేశారు. అర్హులను కాకుండా అనర్హుల పేర్లనే జాబితాలో చేర్చారంటూ జనగామ మండలం సిద్దెంకిలో జాబితాను ఇద్దరు వ్యక్తులు చించివేశారు. అధికారులు జాబితాను చదువుతుండగా లాక్కొని చించివేశారు. అదేవిధంగా జనగామ మండలం వడ్లకొండ గ్రామ సభలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు చెందిన ఇద్దరు కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది. దీంతో పోలీసులు జోక్యం చేసుకొని ఇరువురిని సముదాయించారు. అర్హులకు కాకుండా ఎమ్మెల్యే కడియం శ్రీహరి వర్గీయులనే ఎంపిక చేశారంటూ స్టేషన్‌ఘన్‌పూర్‌లో అధికారులపై పలువురు మండిపడ్డారు. ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో పెళ్లి కాని వారి పేర్లు ఎలా ఉంటాయని

మిగతా 6వ పేజీలో...

రేషన్‌కార్డుల జారీ నిరంతర ప్రక్రియ

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

చిన్నపెండ్యాలలో ఎమ్మెల్యే కడియం వెల్లడి



చిన్నపెండ్యాల గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

చిలుపూర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న రేషన్‌కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే తన లక్ష్యమని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని చిన్నపెండ్యాలలో బుధవారం జరిగిన గ్రామసభకు ఆయన హాజరై మాట్లాడుతూ రేషన్‌కార్డులకు సంబంధించి లిస్టులో పేరు లేని వాళ్లు ఏమాత్రం ఆందోళన చెందవద్దని, మరోసారి దరఖాస్తు ఫారం నింపి పంచాయతీ కార్యదర్శికి అందజేయాలన్నారు. రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వంటి పథకాలకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉంటుందన్నారు. చిన్నపెండ్యాలలో రెడ్డి సంఘం భవన నిర్మాణానికి రూ.10 లక్షలతో పాటు, శిథిలావస్థకు చేరిన గౌడ సంఘం మరమ్మతులకు మరో రూ.5 లక్షలను మంజూరు చేస్తున్నానని ప్రకటించారు. అదేవిధంగా నేషనల్ హైవే నుంచి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం వెళ్లే క్రాస్‌రోడ్ దాకా రోడ్డు వెడల్పు, డివైడర్ నిర్మాణంతో పాటు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. అలాగే మండలంలోని కృష్ణాజీగూడెం, మల్కాపూర్ తదితర గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆర్డీవో డీఎస్ వెంకన్న, జిల్లా పంచాయతీ అధికారి స్వరూపరాణి, మండల ప్రత్యేక అధికారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాధవీలత, తహసీల్దార్ సరస్వతి, ఎంపీవో శ్రీపాద మధుసూదన్, ఏవో నజీరుద్దీన్, ఏఈవోలు బూర్ల నర్సింహులు, గుగులోత్ వినయ్‌కుమార్, కార్యదర్శులు తౌటిరెడ్డి శశిధర్‌రెడ్డి, ఎమ్డీ.అజీజ్, తండ రాంబాబు, నవనీత తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి

యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ర్యాలీ



సే నో టూ డ్రగ్స్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఝాన్సీరెడ్డి, అధికారులు

పాలకుర్తి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, అప్పుడే పాలకుర్తిని డ్రగ్స్ రహిత నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు సాధ్యమవుతుందని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో డ్రగ్స్ వ్యతిరేక ర్యాలీ(సే నో టూ డ్రగ్స్) నిర్వహించగా ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, విశిష్ట అతిథిగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ

మిగతా 6వ పేజీలో...

ఎగవేతల ప్రభుత్వాన్ని నిలదీయాలి

- రైతు ఏడ్చిన రాజ్యం బతికి బట్టకట్టలేదు
- 410 రోజుల పాలనలో 410 మంది రైతులు చనిపోయారు..
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య



లింగాలఘణపురం రైతు నిరసన దీక్షలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య

లింగాలఘణపురం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఎడాపెడా హామీలను కుమ్మరించిన రేవంత్ ప్రభుత్వం తీరా అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఎగవేతల ప్రభుత్వంగా మారిపోయిందని స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య అన్నారు. బుధవారం లింగాలఘణపురం మండల కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనా తీరును నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన దీక్ష

మిగతా 6వ పేజీలో...

ఊపందుకున్న వేరుశనగ కొనుగోళ్లు

జనగామ మార్కెట్‌కు 15 రోజుల్లో 440.70 క్వింటాళ్లు రాక



మార్కెట్‌లో వేరుశనగ కొనుగోళ్లను పరిశీలిస్తున్న మార్కెట్ చైర్మన్ శివరాజ్‌యాదవ్

4

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మానుకోట ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్



మహబూబాబాద్ రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మోసపూరిత వాగ్దానాలు, ప్రకటనలతో మోసాలకు పాల్పడుతున్న మల్టీలెవల్ మార్కెటింగ్ స్కీముల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. ప్రజల సొమ్మును దోచుకునేందుకు సైబర్ నేరగాళ్లు రోజురోజుకూ కొత్త కొత్త పోకడలతో ప్రజల బలహీనతలను పెట్టుబడిగా చేసుకునేందుకు సైబర్ నేరగాళ్లు కొంతపంథాలను ప్రయోగిస్తున్నారని చెప్పారు. ఇందులో భాగంగానే మల్టీలెవల్ మార్కెటింగ్ స్కీం, పిరమిడ్, బిట్‌కాయిన్, వీక్స్ కాయిన్, యాబిట్‌కాయిన్, యూరిక్స్ కాయిన్ లాంటి స్కీముల ద్వారా ప్రజల నుంచి డబ్బులను దోచుకుంటున్నట్లు చెప్పారు. మొబైల్ లేదా సోషల్ మీడియా ప్లాట్‌ఫాం అయిన ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్, ట్విట్టర్ అకౌంట్ ఉన్న వినియోగదారులకు వివిధ రకాల లింకులను పెడుతున్నారని, వాటిని క్లిక్‌చేసి తమ బ్యాంకు ఖాతాఖాళీ చేసుకోవద్దని హెచ్చరించారు. ఎక్కువ సంఖ్యలో ప్రజలు ఆ యాప్‌ల్లో జాయిన్ అయి ఎక్కువ పెట్టుబడులు పెట్టాక ఒకేసారి కంపెనీని ఎత్తివేస్తున్నారని చెప్పారు. అలాంటి ఫేక్ సోషల్ మీడియా ప్రకటనలను నమ్మొద్దని చెప్పారు. జిల్లాలో జరుగుతున్న సైబర్ నేరాలను జిల్లా సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ శ్రీనివాస్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ బాధితులను వెంటనే పోలీస్‌స్టేషన్‌లో సైబర్ వారియర్స్‌ను కలిసేలా చేసి సంబంధిత బ్యాంకు వారితో మాట్లాడి అకౌంట్‌ను హోల్డింగ్‌లో ఉంచడం, గ్రామాల్లో సైబర్ వారియర్స్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. సైబర్ మోసపోతే టోల్ ఫ్రీనెంబర్ 1930కు సమాచారం అందించాలన్నారు.

కేయూలో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : కేయూలో యువతకు నిర్వహించే రెండు రోజుల శిక్షణకు ఈనెల 24లోగా దరఖాస్తు చేసుకోవాలని నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువజన అధికారి చింతల అన్వేష్ బుధవారం తెలిపారు. నెహ్రూ యువకేంద్రం వరంగల్- యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈనెల 25, 26న మత్తు, మాదక ద్రవ్యాల నియంత్రణపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. 18 నుంచి 29 సంవత్సరాలలోపు వయస్సు ఉండాలని, ఎంపికైన అభ్యర్థులకు ఉచిత భోజన వసతి, రవాణ ఖర్చులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని మహబూబాబాద్ జిల్లా యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తిగల యువకులు హనుమకొండ బస్టాండ్ సమీపంలోని నెహ్రూ యువకేంద్రం కార్యాలయంలో ఈనెల 24 మధ్యాహ్నం 2 గంటలలోపు సంప్రదించాలన్నారు. ఇతర వివరాలకు 0870-2958776ను సంప్రదించాలన్నారు.

ఇద్దరు ఫారెస్టు ఉద్యోగుల సస్పెన్షన్

కాకతీయఖని, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ డివిజన్ పరిధి పెగడపెల్లి రేంజ్‌లో పనిచేస్తున్న ఇద్దరు అటవీశాఖ ఉద్యోగులు సస్పెండ్ అయినట్లు సమాచారం. బోర్లగూడెంలో అటవీ, వన్యప్రాణుల సంరక్షణలో నిర్లక్ష్యం వహించినందుకు ఇద్దరు బీట్ అధికారులపై డీఎఫ్‌వో నవీన్‌రెడ్డి ఈ మేరకు చర్యలు తీసుకున్నట్టు సమాచారం. అలాగే పెగడపెల్లి డీఆర్‌వో సస్పెన్షన్‌కు సీసీఎఫ్‌కు నివేదిక పంపినట్టు తెలిసింది. ఈ విషయమై డీఎఫ్‌వో నవీన్‌రెడ్డిని ఫోన్‌లో సంప్రదించగా స్పందించలేదు.

కోటంచలో లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

రేగొండ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని కోటంచ ఆలయంలో లక్ష్మీనరసింహస్వామి కల్యాణం బుధవారం వైభవంగా జరిగింది. స్వామివారి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రం పురస్కరించుకుని ఉదయం సుదర్శన నారసింహహోమం నిర్వహించారు. అనంతరం స్వామి వారికి అభిషేకం చేశారు. మధ్యాహ్నం వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. ప్రధాన అర్చకుడు బుచ్చమాచార్యులు, ఈవో మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పట్టపగలు నడిరోడ్డుపై దారుణ హత్య

- ఆటో డ్రైవర్‌పై కత్తితో మరో ఆటో డ్రైవర్ దాడి
- తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి
- వివాహేతర సంబంధం నేపథ్యంలోనే ఘాతుకం
- హనుమకొండ అదాలత్ జంక్షన్ సమీపంలో ఘటన

హనుమకొండ టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పట్ట పగలు.. మిట్ట మధ్యాహ్నం.. నగరం నడిబొడ్డు.. తీవ్ర జన సంచారం.. వాహనాల రాకపోకలతో బిజీగా ఉన్న ప్రధాన రహదారిపై ఓ ఆటో డ్రైవర్‌ను మరో ఆటోడ్రైవర్ కత్తితో దాడి చేసి హత్య చేశాడు. అందరూ చూస్తుండగానే జరిగిన ఈ ఘాతుకంతో అక్కడున్నవారు భయాందోళనకు గురయ్యారు. సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధి హనుమకొండ అదాలత్ జంక్షన్ సమీపంలో జరిగింది. ఈ దారుణహత్యకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..

కాజీపేట మండలం మడికొండకు చెందిన మాచర్ల రాజ్‌కుమార్ (45) స్థానిక ప్రభుత్వ పాఠశాల సమీపంలో నివాసం ఉంటున్నాడు. ఈయనకు భార్య, ఒక కూతురు, ఒక కొడుకు ఉన్నారు. ఆటో నడుపుకుంటూ రాజ్‌కుమార్ జీవిస్తున్నారు. అలాగే మడికొండ అయోధ్యపురానికి చెందిన ఆటో డ్రైవర్ ఈనుగు వెంకటేశ్వర్లుకు వివాహమైంది. అయితే వెంకటేశ్వర్లుకు ఇదే గ్రామానికి చెందిన ఓ వివాహితతో కొన్నిరోజులుగా వివాహేతర సంబంధం ఉంది. కాగా, అదే మహిళతో రాజ్‌కుమార్ ఇటీవల సన్నిహితంగా ఉంటున్నాడు. ఇది గమనించిన వెంకటేశ్వర్లు రాజ్‌కుమార్‌పై కక్ష పెంచుకున్నాడు. మహిళ జోలికి రావొద్దని పలుమార్లు రాజ్‌కుమార్‌ను వెంకటేశ్వర్లు హెచ్చరించాడు. ఇదే విషయమై కొన్నిసార్లు గొడవపడ్డారు. ఈ క్రమంలో సదరు మహిళ వెంకటేశ్వర్లును దూరం పెట్టింది. దీంతో ఇద్దరిపై వెంకటేశ్వర్లు కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో హనుమకొండ అదాలత్ జంక్షన్ సమీపంలో రాజ్‌కుమార్ ఆటోను, వెంకటేశ్వర్లు తన ఆటోతో వెంబడించి గొడవకు దిగాడు. ఇద్దరికి మాటామాటా పెరిగి వెంకటేశ్వర్లు తన ఆటోలో ఉన్న కత్తితో రాజ్‌కుమార్‌పై దాడి చేశాడు. రాజ్‌కుమార్ కిందపడిపోగానే కత్తితో తీవ్రంగా దాడి చేశాడు. అక్కడ ఉన్న స్థానికులు కత్తితో దాడి చేసిన వెంకటేశ్వర్లును అడ్డుకుని దేహశుద్ధి చేశారు. తీవ్రంగా గాయపడిన రాజ్‌కుమార్‌ను సుబేదారి పోలీసులు ఎంజీఎంకు తరలించగా అప్పటికే రాజ్‌కుమార్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దాడి జరిగిన ప్రాంతానికి సుబేదారి సీఐ పి.సత్యనారాయణరెడ్డి, ఏసీపీ దేవేందర్‌రెడ్డి చేరుకొని పరిశీలించారు. ఘటనకు సంబంధించిన వివరాలు స్థానికులను అడిగి తెలుసుకున్నారు. కాగా, సీసీ కెమెరాల్లో దాడి ఘటన రికార్డు కావడంతో పోలీసులు పరిశీలించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సత్యనారాయణరెడ్డి తెలిపారు.



రాజ్‌కుమార్‌పై కత్తితో దాడి చేస్తున్న వెంకటేశ్వర్లు (తెల్ల చొక్కా)

ఏజెన్సీ మండల అభివృద్ధికి కృషి చేస్తా

మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్



లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న మురళీనాయక్

గూడూరు(మహబూబాబాద్ జిల్లా), జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : గూడూరు ఏజెన్సీ మండల అభివృద్ధి కోసం కృషి చేస్తానని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. గాజులగట్టులో హెల్త్ సబ్‌సెంటర్ ప్రహరీ నిర్మాణం కోసం బుధవారం భూమిపూజ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో 34 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. వెంగంపేటలో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణకోసం శంకుస్థాపన చేశారు. మదనాపురంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బోడ సక్రు అనారోగ్యంతో బాధపడుతుండగా పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఎర్రకుంట తండాలో సీసీరోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులతో అధికారులు అక్కడక్కడ కుమ్మక్కవుతున్నారని ఆరోపించారు. మండలంలో బీఆర్ఎస్ నాయకులతో అధికారులు కుమ్మక్కై వారి చెప్పిన విధంగా సర్వే నిర్వహించి అనర్హులను ఎంపిక చేశారని తనకు ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు. అధికారులు తిరిగి మళ్లీ సర్వే నిర్వహించి అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందించాలన్నారు. తప్పుడు సర్వే చేసిన అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. తహసీల్దార్ శ్వేత, ఎంపీడీవో వీరస్వామి, డిప్యూటీ తహసీల్దార్ కోమల, ప్రత్యేక అధికారులు సారంగపాణి, సత్యనారాయణ, లవారం, దినేష్, రాంబాబు, హేమంత్‌నాయక్, కాంగ్రెస్ జిల్లా నాయకులు ప్రదీప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు చిట్టి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి వాంకుడోతు కొమ్మాలు, బీరం శ్రీపాల్‌రెడ్డి, ఎడ్ల నరేష్‌రెడ్డి, బొల్లికొండ మధు, చంటిస్వామి, మాజీ సర్పంచ్ పడిగే వసంత, భట్టు రమేష్, ఎలకట్టె కార్తీక్ పాల్గొన్నారు.

సీపీఐ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలి

తొర్రూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి విజయసారథి, రాష్ట్ర సమితి సభ్యుడు తమ్మెర విశ్వేశ్వర రావు అన్నారు. బుధవారం తొర్రూరులో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ సాయుధపోరాట నేత తీగల సత్యనారాయణ రావు విగ్రహావిష్కరణ ఈ నెల 25న మహబూబాబాద్‌లో జరుగుతుందన్నారు. పార్టీ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. వంద సంవత్సరాలుగా పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్నామని తెలిపారు. ఎన్నో పోరాటాల ఫలితంగానే నేడు ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని, సాయుధ పోరాట నేత తీగల సత్యనారాయణ రావు పోరాటాల ఫలితంగా నాటి మానుకోట డివిజన్‌తో పాటు ఈ ప్రాంతంలో అనేక సమస్యల కోసం ఆయన నిరంతర పోరాటం చేశాడన్నారు. పార్టీ నిర్మాణం కోసం పాటుపడిన కార్యకర్తలను ఎప్పటికి మర్చిపోదన్నారు. సభకు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సీపీఐ జిల్లా నాయకులు ఓమ భిక్షపతి, మండల కార్యదర్శి మహేందర్, కిరణ్, యాదగిరి, శ్యామ్, లక్ష్మణ్, వెంకన్న, ఎల్లయ్య, నర్సింహరెడ్డి, యాకయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విజయసారథి

డీటీఎఫ్ టీచర్స్ కమిటీ ఎన్నిక

తొర్రూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) మండల కమిటీని ఎంపిక చేసినట్లు ఆ సంఘం రాష్ట్ర కౌన్సిలర్ బుధారపు శ్రీనివాస్ తెలిపారు. బుధవారం తొర్రూరులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. అధ్యక్షుడిగా పులిపాటి తిరుమలేష్, ప్రధాన కార్య దర్శిగా బొమ్మెర కృష్ణ, ఉపాధ్యక్షులుగా ఎం.రవీందర్, కె.స్వప్నతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, నిర్మల, దర్గయ్య, కుమార స్వామి, రవీందర్, వెంకటాచారి, బుచ్చిరాములు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో కార్యదర్శి చేతివాటం

- డబ్బులు వసూలు చేశారంటూ ప్రజల ఆరోపణ
- గ్రామసభలో తహసీల్దార్‌కు గ్రామస్థుల వినతి
- నెల రోజు కిందటే ఆంధ్రజ్యోతిలో కథనం



ప్రత్యేకాధికారికి వినతి పత్రం ఇస్తున్న గ్రామస్థులు

కొత్తగూడ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో పంచాయతీ కార్యదర్శి చేతివాటం ప్రదర్శించారు. ఒక్కో లబ్ధిదారుడి నుంచి రూ.15వందల నుంచి రూ.20 వేలు వసూలు చేశారు. ఈ మేరకు మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం చెరువుముందు తండాలో బుధవారం నిర్వహించిన గ్రామసభలో గ్రామస్తులు మూకుమ్మడిగా జీపీ కార్యదర్శిపై ఆగ్రహం వెలిబుచ్చారు. ఇళ్ల సర్వేలో ఒక్కొక్కరి నుంచి రూ.1500 నుంచి రూ.2000 వసూలు చేసిందని ఆరోపిస్తూ ప్రత్యేకాధికారి, తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేశారు. దీంతో పంచాయతీ కార్యదర్శి జ్ఞానేశ్వరి అవినీతి బయట పడింది.

కాగా, పంచాయతీ కార్యదర్శి జ్ఞానేశ్వరి వసూళ్ల పర్వంపై డిసెంబరు 23న ఆంధ్రజ్యోతి పత్రికలో కథనం ప్రచురితమైంది. సర్వేలో భాగంగా ఆమె ఇంటికి రూ.1500 నుంచి 2000 చొప్పున డబ్బులు చేసిన విషయమై గ్రామస్థుల ఆరోపణలతో ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. కానీ అధికారులు విచారణ చేయకుండా, చర్యలు తీసుకోకుండా ఉదాసీనత పాటించారు. ఈ క్రమంలో బుధవారం జరిగిన గ్రామసభలో ప్రజలు కార్యదర్శి నిర్వాకంపై అధికారులను ప్రశ్నించారు. ఆంధ్రజ్యోతిలో కథనం వచ్చినా ఎందుకు చర్యలు తీసుకోలేదని నిలదీశారు. అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న కార్యదర్శి జ్ఞానేశ్వరిపై ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

అలుపెరుగని యాత్రికుడు

- స్వేచ్ఛ భారత్‌ను కాంక్షిస్తూ యువకుడి సైకిల్ యాత్ర
- ఉత్తరాఖండ్ నుంచి మొదలైన ప్రయాణం

వాజేడు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): స్వేచ్ఛ భారత్ కోసం ఆ యువకుడు పరితపిస్తున్నాడు. 'క్లీన్ ఇండియా.. గ్రీన్ ఇండియా' నినాదంతో సైకిల్ యాత్ర చేపట్టాడు. ఉత్తరాఖండ్ నుంచి బయల్దేరి దేశ పర్యటన చేస్తున్నాడు. రోజుకు 100 కిలో మీటర్ల ప్రయాణం చేస్తూ ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అయిన ములుగు జిల్లా వాజేడు మండలం మండపాక గ్రామానికి బుధవారం చేరుకున్నాడు. ఆయన్ను 'ఆంధ్రజ్యోతి' పలకరించింది. ఉత్తరాఖండ్‌కు చెందిన 29 ఏళ్ల రవికాంత్ గిల్బా సైకిల్ యాత్ర చేపట్టాడు. 53 రోజులుగా ఆయన భారత్ యాత్ర పేరుతో దేశమంతటా చుట్టుముడుతున్నాడు. ఇప్పటి వరకు 5,900 కిలోమీటర్లు పర్యటించాడు. తెలంగాణ మీదుగా ఛత్తీస్‌గఢ్ వైపు వెళ్లాడు. తన గమ్యస్థానం జమ్మూకశ్మీర్ అని, మరో 80 రోజుల్లో అక్కడికి చేరుకుంటానని చెప్పాడు. మరో 9 వేల కిలోమీటర్లు సైకిల్‌పై ప్రయాణం చేయాల్సి ఉందని తెలిపాడు. ఉత్తరాఖండ్ నుంచి ఇప్పటి వరకు హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్, హర్యాన, రాజస్థాన్, మధ్యప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర, గోవా, కర్నాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మీదుగా తన ప్రయాణం సాగిందని పేర్కొన్నాడు. పెట్రోల్ బంకుల వద్ద నిద్రిస్తూ ఎవరైనా ఇచ్చిన ఆహారాన్ని తీసుకుంటూ ముందుకు సాగుతున్నట్లు తెలిపాడు.



సైకిల్ యాత్ర చేస్తున్న రవికాంత్ గిల్బా

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2535	2160
పల్లికాయ (సూక)	6200	5600
పల్లికాయ (పచ్చిది)	4300	4100
కందులు	6382	5560
పెసళ్లు	2852	2800
పత్తి	7210	5800
కొత్త పత్తి	-	-
పసుపు (కాడి)	12111	10234
పసుపు (గోల)	12011	10121
తేజ మిర్చి	14600	9000
తేజ ఏసీ	13000	11000
వండర్‌హాట్ ఏసీ	15000	11500
యూఎస్ 341ఏసీ	13500	12300
యూఎస్ 341	15500	11500
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం



సంకీర్తనలో పాటలు ఆలపిస్తున్న భజన మండలి సభ్యులు

హరినామ సంకీర్తనలో తాడిచర్ల వాసులు

మల్హర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన అఖండ హరినామ సంకీర్తనలో పాల్గొనే అవకాశం భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం తాడిచర్ల గ్రామానికి వెంకటేశ్వరస్వామి భజన మండలి సభ్యులకు దక్కింది. మూడు రోజుల క్రితం తిరుమల వెళ్లిన వారు శ్రీహరి పాదాల చెంత అఖండ హరినామ సంకీర్తనలో పాల్గొన్న వారిలో యెల్లూరి శ్రీనివాస్, ఓజల రాజబాబుతో పాటు పలువురు గ్రామస్థులు ఉన్నారు.

జాతీయస్థాయి మెంటార్‌గా రామయ్య



ములుగు కలెక్టరేట్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ములుగు మండలంలోని అబ్బాపురం జడ్పీహెచ్ఎస్‌లో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డాక్టర్ కందాల రామయ్య జాతీయ ఉపాధ్యాయ విద్యామండలి జాతీయ మెంటార్ మిషన్ (ఎన్‌సీడీఈ)గా ఎంపికయ్యారు. ఉపాధ్యాయ వృత్తి, అభివృద్ధి కోసం ఆయన చేసిన విశేష కృషి, భారతదేశంలో విద్యా నాణ్యతను మెరుగు పరిచేందుకు చేసిన కృషికి ఈ ప్రతిష్ఠాత్మక గుర్తింపు దక్కింది. ఈమేరకు రామయ్య జాతీయ మెంటార్‌షిప్ పూల్‌లో చేరేందుకు ఎన్‌సీటీఈ, జాతీయ మెంటారింగ్ కన్వీనర్ డాక్టర్ దినేష్‌కుమార్ ఈ-మెయిల్ ద్వారా బుధవారం ఆహ్వానం పంపారు. ఈ సందర్భంగా రామయ్యను జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని, అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ కె.మల్లారెడ్డి, అబ్బాపురం జడ్పీ హెచ్ఎం జి.భాస్కర్, ఉపాధ్యాయులు అభినందించారు.

రామప్పను దర్శించిన ఫ్రాన్స్ దేశస్థులు

వెంకటాపూర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామప్ప దేవాలయాన్ని ఫ్రాన్స్ దేశానికి చెందిన వృద్ధ దంపతులు జూర్లీ, అని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు రామలింగేశ్వర స్వామిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం వారు ఆలయ శిల్పకళా సందను వీక్షించి మంత్రముగ్ధులయ్యారు. అక్కడి నుంచి సరస్సు వద్దకు చేరుకుని బోటులో షికారు చేస్తూ ప్రకృతి అందాలను ఆస్వాదించారు.



శిల్పకళా సంపదను వీక్షిస్తున్న ఫ్రాన్స్ దేశస్థులు

తమిళనాడులో సరస్వతి విగ్రహం తయారీ

ప్రత్యేక పూజలు చేసిన కాళేశ్వరాలయ స్థపతి, ఈవో



విగ్రహాన్ని తయారు చేయనున్న శిలకు పూజ చేస్తున్న అర్చకులు

మహదేవపూర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : కాళ్వేశరంలోని త్రివేణి సంగమం వద్ద పుష్కరాల సందర్భంగా ఏర్పాటు చేయనున్న సరస్వతీదేవి విగ్రహం తమిళనాడులోని మహాబలిపురంలో తయారవుతోంది. ఈ క్రమంలో బుధవారం అక్కడికి వెళ్లిన దేవాదాయ శాఖ స్థపతి వల్లి నాయుగం, కార్యనిర్వహణాధికారి ఎ.మారుతి, సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్ అసిస్టెంట్ స్థపతి గణేష్ విగ్రహ తయారీని పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ ప్రత్యేక పూజలు చేశారు.

ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

మైనార్టీ గురుకులం ప్రిన్సిపాల్ వనజ

తొర్రూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మైనార్టీ బాలికల, జూనియర్ కళాశాల గురుకుల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సర ప్రవేశానికి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తొర్రూరు మైనార్టీ గురుకులం ప్రిన్సిపాల్ వనజ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఫిబ్రవరి 10వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 79950 57928 ఫోన్ నంబరులో సంప్రదించాలన్నారు.

ఓవర్ లోడ్ ఇసుక లారీల సీజ్

మల్హర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఓవర్ లోడ్‌తో వెళ్తున్న మూడు ఇసుక లారీలను సీజ్ చేసినట్లు భూపాలపల్లి జిల్లా రవాణా శాఖ అధికారి సమ్మానీ బుధవారం తెలిపారు. మంగళవారం రాత్రి మండలంలోని నాగులమ్మ క్రాస్ వద్ద ఓవర్ లోడ్‌తో వెళ్తున్న మూడు ఇసుక లారీలను పట్టుకొని సీజ్ చేసి కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. పట్టుకున్న లారీలను కొయ్యూర్ పోలీస్ స్టేషన్ వద్ద ఉంచినట్లు చెప్పారు. పరిమితికి మించిన లోడ్‌తో రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇసుక లారీలు

చిన్న జాతరకు చక చకా..

ఫిబ్రవరి 12 నుంచి 15 వరకు మేడారం మినీ సంబురం

- 40లక్షల మందికిపైగా భక్తులు వస్తారని అంచనా
- సౌకర్యాల కల్పనకు రూ.5.33కోట్లు మంజూరు
- పలుశాఖల ఆధ్వర్యంలో పనులు ప్రారంభం



ట్రాక్టర్లలో చెత్త తరలిస్తున్న పారిశుధ్య సిబ్బంది

తాడ్వాయి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మేడారం మినీ జాతరకు సమయం సమీపిస్తోంది. ఫిబ్రవరి 12వ తేదీ నుంచి 15వతేదీ వరకు గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగే సమ్మక్క సారలమ్మల మినీ జాతరకు పనులు చకచకా జరుగుతున్నాయి. ఈ జాతరకు సుమారు 40 లక్షల మంది భక్తులు హాజరవుతారని అధికారులు అంచనా వేశారు. ఈ క్రమంలో జాతర నిర్వహణతో పాటు, బయ్యక్కపేట, కొండాయి, పునుగొండ్ల, ఐలాపూర్, తదితర చిన్న జాతరల నిర్వహణల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రూ.5.33కోట్ల నిధులను మంజూరు చేసిన విషయం తెలిసిందే. అలాగే పలు శాఖల ఆధ్వర్యంలో అధికారులు ప్రణాళికలు రూపొందించి పనులను ప్రారంభించారు.

పలు శాఖల ఆధ్వర్యంలో పనులు


గిరిజన సంక్షేమం ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో రూ.1.12కోట్లు వెచ్చించి ఐటీడీఏ, రెవెన్యూ మూడు అతిథి గృహాల్లో ప్రత్యేక ఏర్పాట్లు, 2020లో కేంద్ర ప్రభుత్వం నిధులతో నిర్మించిన సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు, జంపన్న భక్తుల వసతి భవనాల్లో నీటి వసతి, పారిశుధ్యం, మరుగుదొడ్ల మరమ్మతులు, విద్యుత్ మరమ్మతులు, పలు అభివృద్ధిపనులు, 2018లో నిర్మించిన 27 షాపింగ్ కాంప్లెక్స్‌లలో మరమ్మతు పనులు, పారిశుధ్య కార్మికుల వసతి షెడ్లలో మరమ్మతుల కోసం, బయ్యక్కపేట వనదేవతల జాతర నిర్వాహణ సౌకర్యాలు, ఐలాపూర్ జాతరలో నూతన సులభ్ కాంప్లెక్స్ నిర్మాణం, నీటి సరఫరా కోసం కొత్త బోరు, మోటార్ ఏర్పాటు, కొండాయి గ్రామంలో ఉన్న ఆర్చికి పెయింటింగ్, జాతర పరిసరాల్లో కాంపౌండ్‌వాల్ పనులను చేపట్టనున్నారు.

- గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రూ. 1.47 కోట్లు వెచ్చించారు. వాటితో మేడారంలో పూజారుల అతిథి భవనానికి సీసీ రోడ్డు, భవనం చుట్టూ ప్రహరీ, వంట షెడ్ నిర్మాణం, చిలకలగుట్ట రోడ్ నుంచి సమ్మక్క గుడి వరకు నూతన సీసీ రోడ్ నిర్మాణం, కన్నెపెల్లి సారలమ్మ గుడి వద్ద పూజారుల వసతి ఏర్పాట్లు, భక్తుల సౌకర్యాల ఏర్పాట్లు, బయ్యక్కపేట గ్రామంలో ఎస్సీ కాలనీ నుంచి తాళ్లతోగు వరకు నూతన సీసీ రోడ్‌తోపాటు మట్టి రోడ్ నిర్మాణం, పునుగొండ్ల గ్రామంలో పగిడిద్దరాజు గుడి వద్ద భూమి చదును పనులు, మహబూబాబాద్ జిల్లాలోని గంగారం గ్రామంలోని పగిడిద్దరాజు గుడి వద్ద సీసీ రోడ్ నిర్మాణం చేయనున్నారు.
- నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో రూ. 12.90లక్షల నిధులను వెచ్చించి మినీ జాతర నిర్వహణకు పనులను చేపట్టనున్నారు.
- పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 18.83లక్షల నిధులను వెచ్చించి ఊరట్టం నుంచి కొండాయి, కొండాయి నుంచి ఐలాపూర్, బయ్యక్కపేట నుంచి కాల్వపల్లి, కాల్వపల్లి నుంచి కన్నెపెల్లి వరకు మట్టి రోడ్ల మరమ్మతులు, బయ్యక్కపేట జాతర నిర్వహణ పనులను చేపట్టారు. అలాగే గద్దెలకు అతి సమీపంలోని 21 ఎకరాల్లో పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయనున్నారు.
- మత్స్యశాఖ ఆధ్వర్యంలో రూ.5లక్షల నిధులను వెచ్చించి జంపన్నవాగు, శివరాం సాగర్ చెరువు లోతట్టు ప్రాంతంలో గజ ఈతగాళ్ల ఏర్పాటు చేయనున్నారు.
- విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో రూ. 42లక్షల నిధులను వెచ్చించి మేడారం పరిసరాల్లో 100 కేవీ పది డీటీఆర్‌లు, 3/5 వైరు లైన్లు, స్పేసర్‌లు, డీటీఆర్‌ల చుట్టు ఫెన్సింగ్, విద్యుత్ సిబ్బంది కోసం వసతి పనులను చేపట్టారు.
- జిల్లా పంచాయతీరాజ్ అధికారి ఆధ్వర్యంలో రూ. 81.52 లక్షల నిధులతో జాతర పరిసరాల్లో పారిశుధ్య పనులు చేపట్టనున్నారు. అందుకు పారిశుధ్య కార్మికులు, ఆధునిక యంత్రాలు, ట్రాక్టర్లు, డోజర్లు, ఎక్స్‌కవేటర్లు, దుర్వాసన రాకుండా బ్లీచింగ్ పౌడర్, ఈగలు, దోమలు ప్రబలకుండా లీయోబయోలిక్ రసాయనాల పిచికారీ ఏర్పాట్ల పనులను చేపట్టారు.



మేడారం పరిసరాలలో డీటీఆర్‌లను ఏర్పాటు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

- పౌర సమాచారశాఖ ఆధ్వర్యంలో రూ.4.50లక్షలు వెచ్చించి జాతర పరిసరాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, భోజన వసతులు, రవాణా సౌకర్యం, జాతర సన్నివేశాలను వీడియో, ఫొటోలు తీయడం లాంటివి ఏర్పాటు చేయనున్నారు.
- మిషన్ భగీరథ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో రూ. 24.70లక్షల నిధులతో తాగునీరు, పైపులైన్లు, నల్లాల ఏర్పాట్లు, నీటి సరఫరా, చేతిపంపుల మరమ్మతులు, బోరుబావుల శుద్ధి, జంపన్నవాగులోని ఇన్‌ఫిల్టరేషన్ బావుల పూడికతీత పనులను చేపట్టనున్నారు.
- అటవీశాఖ ఆధ్వర్యంలో రూ.80లక్షల నిధులను వెచ్చించి వన్యప్రాణుల సంరక్షణ, ఫైర్‌సేఫ్టీల ఏర్పాటు, అటవీ సంరక్షణ, మట్టి రోడ్ల అనుమతుల పనులను చేపట్టారు.
- డీడబ్ల్యూవో, ఐసీడీఎస్ శాఖల ఆధ్వర్యంలో రూ.5లక్షల నిధులను వెచ్చించి తప్పిపోయిన వ్యక్తులను గుర్తించడం, నాలుగు ప్రకటన కేంద్రాలు, తప్పిపోయిన వారి కోసం వసతి కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. కాగా పోలీసు, వైద్య, దేవాదాయశాఖ, రెవెన్యూ, ఎక్సైజ్, ఆర్టీసీ, పలు శాఖలకు కూడా నిధులు కేటాయించి మినీ జాతర ఏర్పాట్లను చేపడుతున్నారు.



ములుగులో కమ్మేసిన పొగమంచు

కమ్మేసిన పొగమంచు

- రహదారులపై రాకపోకలకు అంతరాయం
- పలు రైళ్లను వేగం తగ్గించి నడిపిన అధికారులు

ములుగు / కేసముద్రం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పొగమంచు కమ్మేసింది. బుధవారం తెల్లవారుజామున పొగమంచు దట్టంగా కమ్ముకోవడంతో రహదారులపై వాహ నాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. ఉదయం 9గంటలు దాటినా మంచు వదలకపోవడంతో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు, రోజు వారీ పనులకు వెళ్లే కార్మికులు, రైతులు ఆ మంచులోనే ముందుకు కదిలారు. బుధవారం ములుగులో ఈ సీజన్‌లో తొలిసారి ఇంతటి స్థాయిలో మంచు కురిసిందని ప్రజలు చర్చించుకున్నారు. ఇక రైళ్ల రాకపోకలు కూడా కాస్త నెమ్మదిగానే జరిగాయి. తెల్లవారుజామున సమయంలో పొగమంచు కారణంగా మహబూబాబాద్, కేసముద్రం, వరంగల్, కాజీపేట మీదుగా వెళ్లిన పలు రైళ్లను వేగం తగ్గించి నడిపారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రంలె వాతావరణంలో తేమ శాతం 96 చూపింది. రైల్వేట్రాక్‌పై వెళుతున్న రైళ్లు దగ్గరకు వచ్చేంత వరకు ఫ్లాట్‌ఫాంపై ఉన్న ప్రానికులకు కనిపించలేదు. ట్రాక్‌ను నిరంతరం పర్యవేక్షించే కీమెన్లు ఇచ్చే పొగమంచు సమాచారం ఆధారంగా ప్యాసింజర్ రైళ్లను కొంత వేగాన్ని తగ్గించి, లాంగ్ హారన్ ఇస్తూ నడిపినట్టు సిబ్బంది తెలిపారు.




ఇనుగుర్తిలో ఉదయం 8.30కు ఇలా..



కేసముద్రం రైల్వేస్టేషన్‌లో కమ్ముకున్న పొగమంచు

అరచేతిలో అపురూపం

నగర సుందరీకరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికే వరంగల్ మహానగరంలోని పలు కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన ఫౌంటెన్లు, కళారూపాలు నగరవాసులను ఆకట్టుకుంటున్నాయి. ప్రస్తుతం ఎంజీఎం కూడలి వద్ద ఏర్పాటు చేసిన అరచేతిలో శిశువు కళారూపం నగర అందాలను రెట్టింపు చేస్తోంది.





ఫొటో : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హన్మకొండ

వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు



మేడారంలో ముందస్తు మొక్కులు

తాడ్వాయి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడారంలో వన దేవతల దర్శనానికి బుధవారం భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. కోరికలు తీరాలని ఎత్తు బంగారం, యా టలతో మొక్కులు చెల్లించారు. జంపన్న వాగులో పుణ్య స్నానాల అనంతరం వనదేవతలైన సమ్మక్క-సారలమ్మల వద్దకు నడుచుకుంటూ వెళ్లి చీరె, సారె, పసుపు, కుంకుమ, ఎత్తు బంగారం సమర్పించుకున్నారు. సుమారు 15వేల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ అధికారులు వెల్లడించారు.

ఏకాగ్రతే విజయానికి సోపానం

- తల్లిదండ్రులు, గురువులకు రుణపడి ఉండాలి
- విషయ పరిజ్ఞానం లేని విద్య నిరుపయోగం
- ఆధ్యాత్మిక గురువు త్రిదండి చినజీయర్ స్వామి
- వరంగల్‌లో ముగిసిన సాఫల్య-2025 నైపుణ్య శిక్షణ తరగతులు



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న త్రిదండి చినజీయర్ స్వామీజీ

కరీమాబాద్, జనవరి22 (ఆంధ్రజ్యోతి): ఏకాగ్రతతో చదివితే ప్రతీ విద్యార్థి విజయం సాధిస్తాడని ఆధ్యాత్మిక గురువు త్రిదండి చినజీయర్ స్వామి అన్నారు. బుధవారం వరంగల్ ఉర్సు గుట్ట వద్ద ఓ ఫంక్షన్ హాల్‌లో టెన్త్ విద్యార్థుల కోసం వడుప్సా ఆధ్వర్యంలో నిర్వహించిన సాఫల్య-2025 (నైపుణ్య శిక్షణ తరగతులు) కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విషయ పరిజ్ఞానం లేని విద్యతో ప్రయోజనం లేదని, కేవలం మార్కుల కోసం వెంపర్లాడకుండా పాఠంలోని అంతరార్థాన్ని తెలుసుకోవాలని సూచించారు. తల్లిదండ్రులకు, గురువులకు రుణపడి ఉండాలని, మీపై వారు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా వారి కలలను సాకారం చేయాలని ఉపదేశించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన వడుప్సా బాధ్యులకు, తల్లిదండ్రులకు మంగళశాసనాలు అందజేశారు. అనంతరం ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి యాదగిరి మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో, పట్టుదలతో చదవాలని, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని, పూర్తి సమయాన్ని చదువుపై పెట్టి మంచి ఫలితాలను సాధించాలని ఆకాంక్షించారు. ట్రస్మా రాష్ట్ర ముఖ్య సలహాదారుడు యాదగిరి శేఖర్‌రావు మాట్లాడుతూ.. ప్రజ్ఞావికాస్ తరపున రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి ఓరియెంటేషన్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, స్వామీజీ ఆశీస్సులతో వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. ట్రస్మా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఆడెపు శ్యామ్, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ జనరల్ సెక్రటరీ నడిపెల్లి వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ.. విద్యార్థులు రాష్ట్రస్థాయి రిసోర్స్ పర్సన్ల బోధనలను అర్థం చేసుకోవాలని, అదేవిధంగా స్వామీజీ సూచనలు పాటించి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని అన్నారు. అంతకుముందు విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను ఆకట్టుకున్నాయి. వడుప్సా ఖిలా వరంగల్ జోన్ అధ్యక్షుడు ముక్కెర రవీందర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో వడుప్సా(ట్రస్మా) బాధ్యులు అంకటి వీరస్వామి, బిల్ల రవి, ఠాకూర్ జ్ఞానేశ్వర్‌సింగ్, సతీష్, కోడెం శ్రీధర్, చక్రపాణి, రాజు, కిరణ్, వెంట్రాజం, కాంత్రికుమార్, సతీష్‌మూర్తి, ప్రవీణ్, శ్రీనివాస్, మోహన్, రవి, వెంకటేశ్వర్లు, విశ్వనాథ్, శరత్‌బాబు, ప్రసాద్, శ్రీనుబాబు, భాస్కర్, కృష్ణాకర్, వికాస తరంగిణి ప్రతినిధులు పాల్గొన్నారు.

30న కళాకారుల శోభాయాత్ర

- చిన్నజీయర్ స్వామి ఆధ్వర్యంలో నిర్వహణ
- వికాస తరంగిణి చైర్మన్ డాక్టర్ బచ్చు రాధాకృష్ణ

హనుమకొండ కల్చరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): వికాస తరంగిణి హనుమకొండ, వరంగల్ జిల్లాల ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీన హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ నుంచి సుబేదారిలోని ఆర్ట్స్ కళాశాల మైదానం వరకు వందలాది మంది కళాకారులచే శోభయాత్ర నిర్వహించేందుకు విస్తృత చేస్తున్నారు. త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో పెద్ద ఎత్తున జరిగే కళాకారుల శోభయాత్రలో వరంగల్ ఉమ్మడి జిల్లా నుంచి భజన, హరికథ, యక్షగాన, చిందు, కోలాటం లాంటి వివిధ కళా రూపాలతో వందలాది మంది కళాకారులు శోభయాత్రలో పాల్గొననున్నారు. భక్తిమార్గంలో పయనిస్తున్న వివిధ సంప్రదాయాలకు చెందిన కళారూపాలను పరిరక్షించుకోవడం ప్రధాన ధ్యేయంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. చిన్నజీయర్‌స్వామి ఆలోచనకు ప్రతిరూపంగా కళలకు కాణాచిగా వెలుగొందుతున్న ఓరుగల్లులో పెద్ద ఎత్తున నిర్వహించాలని జీయర్‌స్వామి ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా తాము ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నట్లు వరంగల్, హనుమకొండ జిల్లాల వికాస తరంగిణి చైర్మన్, ప్రముఖ వైద్యుడు డాక్టర్ బచ్చు రాధాకృష్ణ చెప్పారు. దార్శనికత వెలుగులో నిర్మాణం అవుతున్న హైందవ భక్తి కళామార్గమే తమ వికాస తరంగణి ఆధ్వర్యంలో సంకీర్తన మండలి అని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో కళారూపాలను ప్రదర్శించే కళాకారులతోపాటు గురువులను ప్రోత్సహిస్తూ గౌరవించడం, భక్తి కళాసంఘాలను ఏర్పర్చి సంఘటితం చేయడం, భక్తి కళాసంఘాల ద్వారా హిందు ధార్మిక విలువలను విస్తరింపజేసే లక్ష్యంతో ఈ బృహత్తర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రాధాకృష్ణ చెప్పారు. ఇందుకుగాను రెండు నెలలుగా ఉమ్మడి జిల్లాలోని అనేక గ్రామీణ ప్రాంతాల్లో నిక్షిప్తమైన కళారూపాలను ప్రదర్శించే కళాకారులతో స్వయంగా అనేక సమావేశాలు నిర్వహించి వారిని ఈ కార్యక్రమానికి సమాయత్తం చేశామన్నారు. భూపాలపల్లి జిల్లాలోని అనేక ప్రాంతాల నుంచి కళాకారులు తరలివస్తారని ఆయన పేర్కొన్నారు. ఇటీవల హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో కళారూపాలను ప్రదర్శించే గ్రూప్ టీం లీడర్లతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి వారికి మార్గదర్శనం చేశామన్నారు. ఒకవైపు భక్తి కళా సంఘాల ద్వారా సామాజిక సేవలను కూడా ప్రోత్సహింపజేసే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అన్నిరకాల కళారూపాలు ఒకేచోట శోభాయాత్ర ద్వారా నగర వాసులను కనువిందు చేసి భక్తి మార్గంలో ఓలలాండింపజేసే కార్యక్రమంలో అన్నిరంగాల కళాకారులు, కళాభిమానులు, ధార్మిక చైతన్యం కలిగిన వారు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు.



చిన్నజీయర్‌స్వామి

శివ శివా.. ఏమిటిదీ?


- గాడి తప్పుతున్న కాళేశ్వరాలయ వ్యవస్థపై భక్తుల్లో అసహనం
- గర్భగుడిలో షూటింగా..? మహా పాపమంటున్న భక్తులు
- కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించాలంటూ డిమాండ్



మహదేవపూర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : 'సాక్షాత్తూ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి సాక్షిగా గర్భగుడిలో ఓ ఆల్బమ్ చిత్రీకరణ కోసం తలుపులు మూసి షూటింగ్ చేయడమా..? ఇది ఎంతవరకు సమంజసం.. దీనికి ఎవరు బాధ్యులు? ఎవరు బాధితులు? అంతా అయిపోయాక ఏమంటే ఏముంది?' అని భక్తురాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దక్షిణాదిన వెలిసిన త్రిలింగాలలో ఒకటిగా విరాజిల్లుతున్న పుణ్యక్షేత్రం కాళేశ్వరంలోని ముక్తీశ్వరాలయ పాలనపై అసహనం వ్యక్తమవుతోంది. కొందరు అధికారుల పట్టింపులేని తనం.. అర్చకుల చేతివాటంతో ఆలయ ప్రతిష్ఠకు భంగం కలుగుతోంది. భూపాలపల్లి జయశంకర్ జిల్లాలోని మహదేవపూర్ మండలం దక్షిణ కాశీగా పేరు ప్రఖ్యాతలు పేరుగాంచిన త్రిలింగ క్షేత్రాలలో ఒకటైన కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయ గర్భగుడిలో సోమవారం ప్రైవేటు ఆల్బమ్ కోసం తలుపులను బంద్ చేసి ఆలయంలో రెండు లింగాల వద్ద ప్రైవేటు వ్యక్తులు షూటింగ్‌ను నిర్వహించారు. దూర ప్రాంతల నుంచి వచ్చిన భక్తులు గంటల తరబడి నిరీక్షించారు. అయినప్పటికీ కూడా దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు, అర్చకులు భక్తులను పట్టించుకోకుండా ఆ పాటలోనే నిమగ్నమైపోయారు. దీంతో ఆలయ పవిత్రతను దెబ్బతీశారని ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించారు. అర్చకులు, సిబ్బంది ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా తయారై ఆలయ పాలన అస్తవ్యస్తంగా తయారైంది. సమయం పాటించకుండా అర్చకులు ఆలయ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నారని పలువురు భక్తులు ఆరోపిస్తున్నారు.

పలువురిపై అనుమానాలు

ఫిబ్రవరి 7, 8, 9 తేదీల్లో మహా కుంభాభిషేకాన్ని నిర్వహించేందుకు ఆలయ అధికారులు తేదీలను ప్రకటించారు. 1972లో మహాకుంభాభిషేకాన్ని నిర్వహించగా దాదాపు 43 సంవత్సరాలకు మళ్లీ ఈ మహా కుంభాభిషేకాన్ని నిర్వహిస్తున్నారు. మే15నుంచి సరస్వతి పుష్కరాల తేదీలను కూడా ప్రకటించారు. అయితే ఈ ఉత్సవాల నిర్వహణ పనుల నిమిత్తమై ఆలయ అధికారులు శృంగేరి పీఠాధిపతుల వద్దకు వెళ్లిన క్రమంలో గర్భగుడిలో అనుమతులు లేకున్నా అర్చకులు పాట చిత్రీకరించారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వెంటనే దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు, ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు రామకృష్ణశర్మకు మెమోతో పాటు నోటీసులు అందజేశారు. దేవాదాయ శాఖ అధికారులు తాము ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని, తాము అందుబాటులో లేమని, తమకు ఎవరూ సమాచారం ఇవ్వలేదని తెలిపారు.



ఆలయంలో ఆల్బం చిత్రీకరణ

ఎవరికి వారే..

దేవుడు వరమిచ్చినా పూజారి దర్శనభాగ్యం కల్పించని చందంగా ఇక్కడి అర్చకులు, సిబ్బంది తీరు ఉంది. కొద్ది నెలల నుంచి ఆలయంలో పనిచేస్తున్న అర్చకులు గ్రూపు రాజకీయాలుగా తయారై వేళాపాల లేకుండా ఆలయానికి చుట్టపుచూపుగా వస్తున్నారు. ఆలయంలో పనిచేస్తున్న సిబ్బంది సైతం ఏమీ పట్టించుకోకపోవడంతో సిబ్బందిదో గ్రూపు, అర్చకులదో గ్రూపు తయారు కావడంతో ఆలయ వ్యవస్థ పూర్తిగా గాడి తప్పింది. గతంలో ఆలయంలో పనిచేసే ముగ్గురు అర్చక సిబ్బంది పదవీ విరమణ చేయడం, కొత్త అర్చకులను నియమించకపోవడంతో ఉన్న అర్చకులు సరైన సమయం పాటించకపోవడం, ప్రైవేటు అర్చకులకు ఆలయాన్ని అప్పజెప్పడం జరుగుతోంది. ఆలయంలో పనిచేస్తున్న రెగ్యులర్ అర్చకులు సొంత పనుల్లో నిమగ్నమైపోతున్నారు. అయినా దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. గతంలో నిత్యం 20 నుంచి 30 వేలు వచ్చే ఆదాయం ఇప్పుడు రూ.4 లక్షల వరకు ఆదాయం పెరిగినప్పటికి దీనికి రెగ్యూలర్ ఈవో లేకపోవడం ఆలయానికి శాపంగా మారింది . కాగా 2024 కు గాను రూ.5 కోట్ల ఆదాయం వచ్చినట్లు సమాచారం.. ఆదాయం పెరిగే కొద్ది ఆలయ ప్రతిష్ఠను భంగపరుస్తున్నారని.. వెంటనే ఉన్నతాధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.

రోజురోజుకూ పెరుగుతున్న భక్తుల సంఖ్య

గతంలో ఆలయానికి వచ్చే భక్తుల రద్దీ తక్కువగా ఉండడం, తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ మూడు రాష్ట్రాలను కలుపుతూ బ్రిడ్జిలు నిర్మాణం కావడంతో భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివార్లను దర్శించుకుంటున్నారు. కానీ భక్తులు వచ్చే సమాయానికి పూజారులు లేకపోతుండటంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాళేశ్వరంలో కాల సర్పదోష నివారణ పూజలు, శని పూజలను నిర్వహించే బుధ, మంగళ వారాల్లో ఎక్కువగా రద్దీ ఉంటుంది. పెళ్లికాని యువతీ యువకులు, సంతానం లేని దంపతులు గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి కాలసర్ప దోష నివారణ పూజలు నిర్వహించుకుంటే వారి ఆకాంక్షలు నెరవేరుతున్నాయని నమ్ముతారు. ఇక తెలంగాణ ప్రభుత్వం మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడంతో రాష్ట్రంలోని నలుమూలల నుంచి కాళేశ్వరానికి పెద్ద ఎత్తున మహిళలు తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటున్నారు. గ్రూపుల సభ్యులు, మహిళా సంఘాల బాధ్యులు మూకుమ్మడిగా వస్తున్నారు. దీంతో కాళేశ్వరం ఆర్టీసీ బస్టాండ్‌లో జనం రద్దీ రోజురోజుకు పెరుగుతోంది.

రసాభాసగా గ్రామ సభలు

- రెండో రోజూ కొనసాగిన నిరసనలు
- ఇళ్లు ఉన్నవారి పేర్లే వచ్చాయని అధికారులను నిలదీసిన ప్రజలు
- తిరిగి సర్వే నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేయాలని డిమాండ్

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంతో పాటు ఛాగల్, కోమటిగూడెం గ్రామాల్లో బుధవారం గ్రామసభలు రసాభాసగా జరిగాయి. ఎక్కడికక్కడ అధికారులను గ్రామస్తులు నిలదీశారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లో జరిగిన గ్రామసభకు పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావడంతో ఉద్రిక్తత నెలకొంది. లిస్టులో పేర్లు రాకపోవడంతో అధికారుల వద్దకు దూసుకెళ్లి నిలదీసే ప్రయత్నం చేశారు. అధికారుల పొంతనలేని సమాధానంతో ఘన్‌పూర్‌కు చెందిన ఓ వ్యక్తి తన వెంట తెచ్చుకున్న దరఖాస్తు ఫారం కలిగి ఉన్న కవర్‌ను అధికారులపై విసిరివేశాడు. పలువురు మహిళలు అధికారులను దూషించారు. ఇళ్లు ఉన్నవారినే ఎలాఎంపిక చేస్తారని మండిపడ్డారు. సీఐ జి.వేణు ఆధ్వర్యంలో పోలీసులు గ్రామస్తులను శాంతింపచేసే ప్రయత్నం చేశారు. కోమటిగూడెంలో జరిగిన గ్రామసభలో ఇళ్ల జాబితాపై అధికారులను నిలదీశారు. ఇళ్ల కోసం 430 మంది దరఖాస్తులు చేసుకుంటే 109 మందితో జాబితాను ఎలా ప్రకటిస్తారని ప్రశ్నించడంతో సరైన సమాధానం రాలేదు. గ్రామసభను రద్దు చేయాలని పట్టుబట్టారు. ఛాగల్ గ్రామంలో జరిగిన గ్రామ సభలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన వారి పేర్లనే ఎంపిక చేశారని బీఆర్‌ఎస్ నాయకులు నిలదీసే ప్రయత్నం చేయగా మీ ప్రభుత్వంలో ఏంచేశారని కాంగ్రెస్ నాయకులు వాగ్వాదంకు దిగారు. ఎస్సై వినయ్‌కుమార్ నాయకులను శాంతింపచేశారు.

● బచ్చన్నపేట: మండలంలో జరిగిన ప్రజాపాలన గ్రామసభలు రసాభాసగా కొనసాగాయి. కట్కూరు, బచ్చన్నపేట, పోచన్నపేటలో అధికార పార్టీ, ప్రతిపక్ష బీఆర్‌ఎస్ నాయకుల మధ్య వాగ్వాదం తీవ్ర స్థాయిలో కొనసాగింది. కట్కూరులో అర్హులైన లబ్ధిదారుల జాబితాను అధికారులు చదవగానే, అందులో ఎంత మందికి ఇళ్లు ఇస్తారంటూ బీఆర్‌ఎస్ నాయకులు ప్రశ్నించారు. బచ్చన్నపేటలో సైతం గందరగోళంతో సభ నడిచింది. కేశిరెడ్డిపల్లి, కొన్నె, లింగంపల్లి, పడమటికేశ్వాపూర్ గ్రామాల్లో సైతం నిలదీతల పర్వం కొనసాగింది.

● నర్మెట: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని తహసీల్దార్ రామానుజచారి, ఎంపీడీవో అరవింద్ అన్నారు. అమ్మాపురం, హన్మంతాపూర్, మల్కపేట, లోక్యతండా, మాన్‌సింగ్‌తండా, ఆగాపేట, సూర్యబండతండా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. సర్వే జాబితాను చదివి వినిపించారు. తమ పేర్లు లేకపోవడంతో అధికారులను అడిగారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి శ్రీకాంత్, ఎస్సై నగేష్, కార్యదర్శులు పాల్గొన్నారు.

● దేవరుప్పుల: మండలంలోని 9 గ్రామాల్లో బుధవారం అధికారులు గ్రామసభలు నిర్వహించారు. కామారెడ్డిగూడెం, సీత్యతండా, సీతారాంపురం, కోలుకొండ, పడమటితండా, రాంరాజుపల్లి, బంజారా, అప్పిరెడ్డిపల్లె, రంభోజీగూడెం గ్రామాల్లో గ్రామ సభలు జరిగాయి. సీతారాంపురంలో మేము దరఖాస్తు చేసుకున్నప్పటికీ మా పేరు ఎందుకు రాలేదని అధికారులను నిలదీశారు. కేవలం జాబితా చదివి వెళ్లి పోవటానికి మాత్రమే వచ్చారా? అని ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. అప్పిరెడ్డిపల్లె గ్రామసభలో అధికారులు పేర్లు చదువుతుండగా నిరసన తెలుపడంతో అధికారులు మమ అనిపించి వెళ్లిపోయారు.

● రఘునాథపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో గ్రామ సభలు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ లింగాల జగదీష్ చందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మేకల వరలక్ష్మి, ఎంపీడీవో గార్లపాటి శ్రీనివాసులు, మంజుల, త్రివేణి, లింగంపల్లి నర్సింహులు, ఆర్ఐ శరత్‌చంద్ర పాల్గొన్నారు.

● పాలకుర్తి: మండలంలోని విస్నూరు, మల్లంపల్లి, బమ్మెర, దర్దెపల్లి, సిరిసన్నగూడెం, నర్సింగపురం తండా, ఈరవెన్ను, మంచుప్పుల, తిర్మలగిరి గ్రామాల్లో జరిగిన గ్రామ సభల్లో అధికారులు పలు పథకాలకు సంబంధించిన లబ్ధిదారుల ఎంపిక వివరాలు వెల్లడించగా వ్యతిరేకత వ్యక్తమైంది. ఇందులో తప్పులు ఉన్నాయని ఉన్నోళ్లకే మళ్లీ ఇళ్లు, రేషన్ కార్డులు మంజూరి అయ్యాయని, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కూడా వ్యవసాయ భూములు ఉన్నోళ్లకే మంజూరి అయ్యాయని గ్రామస్తులు, బీఆర్‌ఎస్ నాయకులు వాగ్వాదానికి దిగారు. బమ్మెరకు సీఐ మహేందర్‌రెడ్డి చేరుకొని పరిస్థితులను పర్యవేక్షించారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో రాములు, అశోక్, రవీందర్, సంధ్య, ప్రశాంతి, శరత్‌చంద్ర పాల్గొన్నారు.

● జఫర్‌గడ్: మండలంలోని తమ్మడపల్లి(జి), తిమ్మంపేట, సూరారం, హిమ్మత్‌నగర్, తిమ్మాపూర్ గ్రామాల్లో జరిగిన గ్రామసభల్లో పథకాల అర్హుల జాబితాలపై విపక్ష పార్టీల ప్రతినిధులు, గ్రామస్తులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జాబితాల్లో అనర్హుల పేర్లను చేర్చారని, అసలైన నిరుపేదల పేర్లు జాబితాలో లేవని మండిపడ్డారు. రీసర్వే జరిపి అర్హులకు పథకాలకు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామ సభల్లో మండల స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ రాధాకిషన్, ఏవో కరుణాకర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ సుకన్య, డీటీ ఖాసీం, ఎంఆర్ఐ అనిల్‌బాబు, డాక్టర్ సారంగపాణి, వివిధ శాఖల అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

● కొడకండ్ల: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. రామన్నపేటలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో ఆమె పాల్గొని ప్రభుత్వం అమలు చేయనున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఏవో విజయరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డి.సురేష్‌నాయక్, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం నిర్వహించిన గ్రామసభల్లో ప్రజలు సంక్షేమ పథకాల కోసం అధికారులను నిలదీయడంతో రసాభాసగా మారాయి. కడగుట్టతండాలో, నర్సింగాపురం, రంగాపురం, మొండ్రాయి గ్రామాల్లో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. లబ్ధిదారుల జాబితాను గ్రామసభలో ప్రకటించాలని పట్టుబట్టారు. పోలీసులు, అధికారులు జోక్యం చేసుకుని సర్దిచెప్పడంతో గొడవ సద్దుమణిగింది. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రమోహన్, ఎంపీడీవో నాగశేషాద్రి సూరి, ఎంపీవో ఇందిర, ఏవో విజయరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

అర్హుల జాబితాను పరిశీలించిన కలెక్టర్

లింగాలఘణపురం: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాల జాబితాలో అనర్హుల పేర్లు వచ్చాయని మండల కేంద్రానికి చెందిన ప్రజలు గ్రామసభలో అధికారులను నిలదీసిన నేపథ్యంలో బుధవారం జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా లింగాలఘణపురంను సందర్శించారు. ఈ సందర్భంగా అర్హుల జాబితాను పరిశీలించిన కలెక్టర్ అనర్హుల పేర్లు రావడానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అర్హులకు కచ్చితంగా ప్రాధాన్యత ఉంటుందని సూచించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ రవీందర్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



రామన్నగూడెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



హిమ్మత్‌నగర్‌లో అధికారులను ప్రశ్నిస్తున్న గ్రామస్తులు



దర్దెపల్లి గ్రామంలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు



బచ్చన్నపేటలో అధికారులను నిలదీస్తున్న ప్రజలు

నిలదీతల పర్వం

(3వ పేజీ తరువాయి)

మహిళలు నిలదీశారు. జాబితా అంతా తప్పుల తడకగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రీసర్వే చేసి అర్హులనే ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. కాగా.. తమ చేతిలో ఏమీ లేదని ప్రభుత్వం నుంచి వచ్చిన జాబితాను మాత్రమే తాము చదువుతున్నామని అధికారులు సమాధానం ఇచ్చారు.

మహిళ కంటతడి

బచ్చన్నపేట : ఇందిరమ్మ ఇంటికి తాను అర్హురాలిని కాదా.. అంటూ మండల కేంద్రానికి చెందిన సిరిపాటి స్వరూప బుధవారం బచ్చన్నపేటలో జరిగిన గ్రామసభలో కంటతడి పెట్టారు. మూడేళ్లుగా గ్రామంలో కిరాయి ఇంట్లో భర్త స్వామి, ఇద్దరు పిల్లలతో కలిసి ఉంటున్నానని తెలిపింది. ఇంటికోసం పలుమార్లు దరఖాస్తు చేశానన్నారు. ఆరు మాసాలకు ఒకసారి అద్దె ఇళ్లు మారుతుంటే తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తమ పేరును ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో చేర్చకపోవటం ఏంటని ప్రశ్నించారు. దీంతో స్పెషల్ ఆఫీసర్ రామారావు నాయక్, ఎంపీడీవో మల్లికార్జున్ దరఖాస్తు రాసివ్వాలని సూచించారు.

తిరగబడిన జనం..

జనగామ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలు కోసం చేపట్టిన ప్రజాపాలన గ్రామసభల్లో జనం తిరగబడ్డారు. మండలంలోని వడ్లకొండలో అర్హులకు సంక్షేమ పథకాలను అందించడం లేదని ఆరోపిస్తూ బీఆర్‌ఎస్ కార్యకర్తలు అధికారులను నిలదీశారు. అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని గ్రామ సభను అడ్డుకోవడానికి ప్రయత్నించగా కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్యకర్తలు బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి ఏమిటని ప్రశ్నించారు. ఇరువురు ఘర్షణ పడి ఒక్కరిపై ఒక్కరు చేయి చేసుకున్నారు. జనగామ ఎస్సై రాజేశ్‌కుమార్ ఇరువురిని శాంతింపజేయడంతో సభ కొనసాగింది. అర్హులకు సంక్షేమ పథకాలను అందజేయకుండా అనర్హులకు అందజేస్తున్నారని ఆరోపిస్తూ సిద్దెంకి గ్రామ ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని 13వ వార్డు ధర్మకంచలో లబ్ధిదారుల పేర్లు చదవకుండా దరఖాస్తు చేసుకున్న వారి పేర్లు చదవడం ఏమిటని అధికారులను బీఆర్‌ఎస్ నాయకులు నిలదీశారు. దీంతో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. సీఐ దామోదర్‌రెడ్డి, ఎస్సై చెన్నకేశవులు నచ్చజెప్పి సంఘటన స్థలం నుంచి పంపించారు. అలాగే అనర్హులకు సంక్షేమ పథకాలను అందజేస్తున్నారని పెద్ద పహాడ్ గ్రామస్థులు అధికారులను నిలదీశారు.

జాబితాలో వివాహం కానివారి పేర్లు..

స్టేషన్‌ఘన్‌పూర్ : ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక జాబితాలో వివాహం కాని వారి పేర్లు ఎలా వస్తాయని పలువురు ఆగ్రహం వ్యక్తం చేసిన సంఘటన బుధవారం ఘన్‌పూర్‌లో చోటుచేసుకుంది. ఈ సందర్భంగా పలువురు బాధితులు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో ఎమ్మెల్యే కడియం వర్గీయులకు సంబంధించిన పేర్లు మాత్రమే ఉన్నాయని తెలిపారు. జాబితాలో వివాహంకాని వారి, రిటైర్డ్ ఉద్యోగులు, ఆర్టీసీ కండక్టర్, డ్రైవర్ల కుటుంబ సభ్యులు, ప్రైవేట్ ఆస్పత్రులు నిర్వహిస్తున్న వారి, డాక్టర్లు, భవంతులు ఉన్నవారు, ఎకరాల కొద్ది భూములు ఉన్నవారు, రియల్టర్ల పేర్లు ఎలా వస్తాయని మండిపడ్డారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ వద్దకు వెళుతామన్నారు. తిరిగి సర్వే నిర్వహించి నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని, లేదంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేబడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బాధితులు మాతంగి కుమార్, మారపల్లి ప్రసాద్, మారపాక శేఖర్, కిశోర్, నారగోని పద్మ, చింత సురేష్, చింత అంజి, చింత నరేష్, గుర్రం కిషన్ పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

(3వ పేజీ తరువాయి)

ఇన్‌చార్జ్ అనుమాండ్ల ఝాన్సీరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ఎవరైనా డ్రగ్స్ వినియోగిస్తున్నా, విక్రయిస్తున్నా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. చదువుకునే వయసులో యువత క్రమశిక్షణతో ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల ఆరోగ్యం క్షీణిస్తుందన్నారు. ప్రభుత్వం నిషేధించిన మాదక ద్రవ్యాలను సమూలంగా నిర్మూలించడంలో యువత ముందుండాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ నాయకురాలు అనుమాండ్ల ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నార్కోటిక్ డీఎస్పీ సైదులు, సీఐ మహేందర్‌రెడ్డి, ఎక్సైజ్ సీఐ సంతోష్ రెడ్డి, తొర్రూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అనుమాండ్ల తిరుపతిరెడ్డి, ఎంఈవో పోతుగంటి నర్సయ్య, ఎక్సైజ్ ఎస్సై కె.పద్మ, పాలకుర్తి మార్కెట్ చైర్‌పర్సన్ లావుడ్యా మంజుల భాస్కర్, రాజేష్ నాయక్, మహేష్ పాల్గొన్నారు.

ఎగవేతల ప్రభుత్వాన్ని నిలదీయాలి

(3వ పేజీ తరువాయి)

చేపట్టారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ రాజయ్య ముఖ్య అతిథిగా హాజరై కాంగ్రెస్ ప్రభుత్వం పనితీరును దుయ్యబట్టారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 410 రోజుల్లో రోజుకొక్కరు చొప్పున మొత్తం నేటికి 410 మంది రైతులు ఆత్మహత్య చేసుకుని చనిపోయారన్నారు. ఎన్నికల ముందు నోటికొచ్చిన హామీలను గుమ్మరించిన రేవంత్‌రెడ్డి తీరా అధికారంలోకి వచ్చాక హామీలన్నీ నీటిమూటలుగా మారిపోయాయన్నారు. రైతులకు ఏడాదికి ఎకరాకు రూ.15వేల రైతు భరోసా, కల్యాణలక్ష్మి పథకం ద్వారా రూ.లక్ష ఆర్థిక సాయంతోపాటు తులం బంగారం, నిరుద్యోగులకు జీవనభృతి కింద నెలకు రూ.4వేల సాయం, బాలికా విద్యార్థులకు స్కూటీలు, పండించిన ప్రతీ గింజకు బోనస్, రూ.2లక్షల రుణమాఫీ, కౌలు రైతులకు ఆర్థిక సాయం లాంటి అనేక హామీలను ప్రస్తుతం అమలు చేయకుండా ఎగవేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎద్దు ఏడ్చిన ఎవుసం.. రైతు ఏడ్చిన రాజ్యం చరిత్రలో బతికి బట్టకట్టినట్లు లేదని రాజయ్య అన్నారు. రైతులను అడుగడుగునా మోసం చేయడం కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యంగా ముందుకు సాగుతుందన్నారు. రాష్ట్రంలో కొనసాగుతున్న ఎగవేతల ప్రభుత్వాన్ని ఊరూరా నిలదీయాలని పిలుపునిచ్చారు. సీఎంగా కేసీఆర్ ఎంతో ముందుచూపుతో రాష్ట్రాన్ని ముందుకు నడిపించారన్నారు. రేవంత్‌రెడ్డి ఏడాది పాలన పూర్తిగా గుండు సున్న మాత్రమేనని, ఢిల్లీలో రాహుల్‌కు ముడుపుల మూటలు అప్పజెప్పడం తప్ప రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడం శూన్యమన్నారు. ఇప్పటికైనా ప్రతి ఒక్కరూ చైతన్యవంతమై కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు సేవెల్లి సంపత్, మండల శాఖ అధ్యక్షుడు బస్వగాని శ్రీనివాస్, నాయకులు గండి యాదగిరి, చౌదరిపల్లి శేఖర్, ఊడ్గుల భాగ్యలక్ష్మి, ఏదునూరి వీరయ్య, గాదెపాక విష్ణు, మబ్బు కర్ణాకర్, గట్టిగల్ల శ్రీహరి, చౌదరిపల్లి పూర్ణచందర్, దాయ ఉపేందర్, నల్ల రాహుల్, దండిగ మహేశ్, ఎడ్ల రాజు, కె.వెంకటేశ్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నేతలు నోరు అదుపులో పెట్టుకోవాలి

చిలుపూర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ నేతలు నోరు అదుపులో పెట్టుకోవాలని, తమ నాయకుడు, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై ఇష్టానుసారంగా మాట్లాడితే సహించే ప్రసక్తే లేదని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గడ్డమీది సురేశ్ హెచ్చరించారు. బుధవారం మండలంలోని చిన్నపెండ్యాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్యే కడియం సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో అనతి కాలంలోనే అభివృద్ధి పనుల కోసం రూ. 750 కోట్లను మంజూరు చేయించారన్నారు. బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి ఎమ్మెల్యే కడియంను అసభ్య పదజాలంతో దూషించడం తగదన్నారు. మరోసారి పునరావృతమైతే దళితుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో మాజీ సర్పంచులు తాళ్లపల్లి సమ్మయ్య, మామిడాల లింగారెడ్డి, మాజీ ఎంపీటీసీ తాళ్లపల్లి సంపత్, బొమ్మిశెట్టి బాలరాజు, సాంబారి రాజేశ్వర్, ఎమ్డీ.షకీల్, రాజ్‌కుమార్, హరిబాబు, రాజన్‌బాబు, ఇల్లందుల యాదగిరి, చిలుపూర్ గుట్ట డైరెక్టర్ రత్నాకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఇసురం కృష్ణ, అశోక్‌పాల్, జీడి రమేష్, దార రాజు పాల్గొన్నారు.

రిజర్వాయర్ల పనుల్లో నిర్లక్ష్యం

- పాలకుర్తి, చెన్నూరు రిజర్వాయర్లను పరిశీలించిన సీపీఎం

పాలకుర్తి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) పాలకుర్తి, చెన్నూరు రిజర్వాయర్ల పనులు పునరుద్ధరించడంలో పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సింగారపు రమేష్ విమర్శించారు. గురువారం మండలంలోని పాలకుర్తి, చెన్నూరు రిజర్వాయర్లను సీపీఎం నాయకుల బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో ప్రారంభమైన రిజర్వాయర్ల పనులు ఇప్పటి వరకు కూడా పూర్తి చేయలేదన్నారు. 14 ఏళ్లు గడుస్తున్నప్పటికీ ప్రభుత్వాలు మారుతున్నాయే తప్ప రిజర్వాయర్ల పనులు పూర్తి చేస్తలేరని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రిజర్వాయర్ల పనులు పూర్తి చేస్తామని ప్రకటించిన పాలకులకు పట్టింపులేదని విమర్శించారు. పనుల్లో నాసిరకం ఇసుకను వినియోగిస్తున్నారని, నాణ్యత లేమితో పనులు చేస్తున్నట్లు తెలిపారు. పాలకుర్తి చెరువు ఇప్పుడు దేనికి పనికి రాకుండా పోయిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి మాచెర్ల సారయ్య, చిట్యాల సోమన్న, సోమ సత్యం, మాసంపల్లి నాగయ్య, ఏదునూరి మదార్ తదితరులు పాల్గొన్నారు.



అసంపూర్తిగా ఉన్న చెన్నూరు రిజర్వాయర్ పనులను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

క్యాలెండర్ ఆవిష్కరణ

కొడకండ్ల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వెంకటాద్రి ఎంఈవో గ్రేస్ కేజియారాణితో కలిసి ఆ సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు బి.సైదులు, సోమయ్య, డి.ప్రభాకర్, రమాదేవి, మంజుల, స్వప్న మొయిజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన దివ్యాంగులకు రుణాలు

జనగామ రూరల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): అర్హులైన దివ్యాంగులకు రుణాలను మంజూరు చేయడం జరుగుతుందని దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి డి.ఫ్లోరెన్స్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు ఆర్థిక ప్రోత్సాహక పథకం ద్వారా జీవనోపాధి కల్పించుటకు రుణాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. అర్హులైన వారు TGOBMMS.CGG.GOV.IN వెబ్‌సైట్ ద్వారా ఫిబ్రవరి 2 లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రేపు రక్తదాన శిబిరం

జనగామ రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఈనెల 24న రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు కెమిస్ట్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మెరుగు దేవరాజ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్, డ్రగ్గిస్ట్(ఏఐవోసీడీ) అనుబంధ సంఘం తెలంగాణ రాష్ట్ర కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని స్వప్న హాస్పిటల్‌లో శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

చేనేత విభాగం మండల అధ్యక్షుడిగా రాజేశ్వర్



చిలుపూర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ అనుబంధ చేనేత విభాగం మండల అధ్యక్షుడిగా మల్కాపూర్‌కు చెందిన సాంబారి రాజేశ్వర్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం జిల్లా అధ్యక్షుడు సామల పరమేశ్వర్ నియామక ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సందర్భంగా రాజేశ్వర్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్యే కడియం శ్రీహరికి కృతజ్ఞతలు తెలిపారు.

గురుకుల పాఠశాలల్లో చేర్పించండి

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మెరుగైన విద్యను అందిస్తున్న గురుకుల పాఠశాలల్లోనే విద్యార్థులను చేర్పించాలంటూ బుధవారం ఘన్‌పూర్ మండల కేంద్రంలోని బస్టాండ్‌లో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు కళాజాత ప్రదర్శను నిర్వహించారు. ఆటపాటల ద్వారా గురుకుల పాఠశాలల ఆవశ్యకతను వివరించారు. గురుకులాల్లో అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్యాబోధనను అందిస్తున్నారని పాటలతో ప్రజలను అలరించారు.

ఈ కార్యక్రమంలో టీం లీడర్ పిన్నమల్ల సాంబయ్య, ఎడవెల్లి విజయ, గడిపె బాలయ్య, తిప్పరి శ్రీనివాసులు, చిరంజీవి, రవి, సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల వసతిగృహం సందర్శన

- వసతులు పరిశీలించి రాత్రి నిద్ర చేసిన అధికారి

జనగామ రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : బాలికల వసతి గృహాలలో మహిళా ఐఏఎస్ అధికారులు రాత్రి నిద్ర చేయాలని ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో ఐఏఎస్ అధికారి నిఖిల మంగళవారం రాత్రి జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలను సందర్శించారు. కళాశాలలోని ల్యాబ్‌లు, కిచెన్, తరగతి గదులు, మెస్‌ను పరిశీలించి విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు చికెన్, మటన్, గుడ్లు, పండ్లు, స్నాక్స్ ఇస్తున్నారా? అని నిర్వాహకులను అడిగారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి ఆరోగ్యం పట్ల మరింత శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. మంగళవారం రాత్రి బసచేసిన అధికారి నిఖిల బుధవారం ఉదయం వెళ్లిపోయారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల వసతి గృహాన్ని పరిశీలిస్తున్న ఐఏఎస్ అధికారి నిఖిల

లక్ష డప్పుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

జనగామ రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించే 'లక్ష డప్పులు - వెయ్యి గొంతులు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గడ్డం సోమరాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం జనగామ చౌరస్తాలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు దివ్యాంగులు అధిక సంఖ్యలో చలో హైదరాబాద్‌కు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో రాగళ్ల ఉపేందర్, బీర్రు నాగేష్, గద్దల కిషోర్, గువ్వల రవి తదితరులు పాల్గొన్నారు.

'నిరుపేదలకు సీఎంఆర్‌ఎఫ్ వరం'



బాధితురాలికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందిస్తున్న కిరణ్‌కుమార్‌గౌడ్

జనగామ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు సీఎంఆర్‌ఎఫ్ పథకం వరం లాంటిదని కాంగ్రెస్ పార్టీ నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్‌గౌడ్ అన్నారు. జిల్లాకేంద్రానికి చెందిన గుండేటి అన్నపూర్ణకు సీఎంఆర్‌ఎఫ్ కింద మంజూరైన రూ. 2.50 లక్షల చెక్కును బుధవారం స్థానికంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఎంతో మంది పేదలకు ఆర్థికంగా భరోసా లభిస్తోందన్నారు. సీఎంఆర్‌ఎఫ్ మంజూరు పట్ల సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాంద యాకర్, మస్యాల చందర్, కొన్నె మహేందర్‌రెడ్డి, దూడల సిద్ధయ్యగౌడ్, చిలువేరు సంపత్, తొట్టె నరేందర్, వేముల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఇచ్చిన పిలుపులో భాగంగా 'తెల్ల టీషర్టులు వేసుకొని ఆయనకు మద్దతు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సామాన్యుల హక్కుల పట్ల వివక్ష చూపిస్తోందని, దీనిని పారద్రోలి సమానత్వాన్ని సాధించాలన్న డిమాండ్‌తో తెల్ల టీషర్టులు ధరించాలని పిలుపు నిచ్చారన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

కొడకండ్ల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదబావితండాలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు డి.సురేష్‌నాయక్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి సమక్షంలో బుధవారం 50 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరాయి. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే కాంగ్రెస్ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ పార్టీలో సముచిత స్థానం లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామపార్టీ అధ్యక్షుడు భిక్షపతినాయక్, మంగు నాయక్, నరేంద్రపవార్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కవయిత్రి శ్రీలతకు జాతీయ పురస్కారం

జనగామ కల్చరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రానికి చెందిన కవయిత్రి కొట్టె శ్రీలత జాతీయ పురస్కారం అందుకున్నారు. ప్రతిభ మీది - పట్టాభిషేకం మాది అంటూ శ్రీశ్రీ కళావేదిక, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్, వరల్డ్ రైటర్స్ ఫోరం, వరల్డ్ పోయెట్రీ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడలో ఈ నెల 21న జాతీయ పురస్కారాలు అందజేశారు. సాహిత్య రంగంలో చేస్తున్న సేవలకు గాను శ్రీలతను 'తెలుగు కీర్తి' జాతీయ ప్రతిభా పురస్కారంతో సత్కరించి ప్రశంసాపత్రం అందజేశారు. శ్రీలత హృదయ స్పందన అనే కలం పేరుతో సాహిత్యాన్ని సృజిస్తున్నారు. ఇటీవల కల్చరల్ క్రియేటివ్ చానల్ ద్వారా పలు లఘుచిత్రాల్లో ప్రధాన పాత్రలో నటించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. శ్రీలత పురస్కారం అందుకోవడం పట్ల శ్రీశ్రీ కళావేదిక సీఈవో కత్తిమండ ప్రతాప్, కవులు, కళాకారులు జి.కృష్ణ, మాచర్ల భిక్షపతి, అయిలా సోమనర్సింహాచారి, లగిశెట్టి ప్రభాకర్, సోమేశ్వరాచారి, శ్రీనివాస్ గౌడ్, ఎల్లయ్య, లావణ్య, శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు.



ఆలయంలో పూజలు చేస్తున్న సూపరింటెండెంట్ అనిత

వేంకన్న సన్నిధిలో ఎక్సైజ్ అధికారుల పూజలు

చిలుపూర్, జనవరి22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని చిలుపూర్ గుట్ట బుగులు వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ అనిత బుధవారం సందర్శించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు సమర్పించారు. పూజారులు బ్రాహ్మణపల్లి రవీందర్‌శర్మ, రంగాచార్యులు వేదమంత్రాలు ఆలపించి వారికి స్వామి వారి తీర్థప్రసాదాలతో పాటు ఆశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ అనిత మాట్లాడుతూ తమ ఇలవేల్పు బుగులు వేంకటేశ్వర స్వామిని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, ఈవో భాగం లక్ష్మీప్రసన్న, కుర్రెంల మోహన్, ఎక్సైజ్ సీఐ భాస్కర్ రావు, ఎస్సైలు నరేశ్, సుధామాధురి తదితరులు పాల్గొన్నారు.

మానసిక బాధను భరించలేకపోతున్నాం..

కలెక్టర్‌కు వృద్ధురాలి వినతి

రఘునాథపల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మట్టిని తవ్వుతున్నారని అసత్య ఆరోపణలతో మా కుటుంబ సభ్యులను జాపరగూడెంకు చెందిన ఇద్దరు వ్యక్తులు మానసికంగా వేదిస్తున్నారని బాధితురాలు మండలకేంద్రంలో బుధవారం తమ గోడును విలేకరులకు తెలిపారు. ఈ మేరకు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. బాధితురాలు గోసికొండ సూర్యకళ తెలిపిన ప్రకారం... నా భర్త జ్ఞాపకార్థం ఆయన స్వగ్రామం జాపరగూడెం సమీపంలోని సర్వే నెంబర్లు 1413, 1420, 1421లో గల 11.5 ఎకరాలను 2019లో ఇద్దరు కుమారులతో కలిసి కొనుగోలు చేశామని తెలిపారు. ఇందులోని 4.5 ఎకరాలను కబ్జా చేసేందుకు జాపరగూడెం గ్రామానికి చెందిన వారాల రమేష్, పులిగిల్ల అంజయ్య ప్రయత్నించగా వారిద్దరిపై కోర్టు కేసు దాఖలు చేయగా, జనగామ జిల్లా కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ఇంజక్షన్ ఆర్డర్ జారీ చేయడంతో ఆ విషయం సబ్ జడ్జి పరిధిలో ఉందన్నారు. మిగిలిన 7 ఎకరాలలోని 3 ఎకరాలలో వరి పంట సాగు చేశామని, ఒక ఎకరంలో పండ్ల మొక్కలు పెంచుతున్నామని వివరించారు. మిగతా 3 ఎకరాలు ఎక్స్‌వేటర్‌తో చదును చేస్తుంటే పనులకు ఆటంకం కలిగిస్తూ రమేష్, అంజయ్య కొందరు వ్యక్తులను తీసుకొచ్చి మట్టి తవ్వుతున్నారని బెదిరిస్తూ మాపై కోర్టులో దాఖలు చేసిన కేసు ఉపసంహరించుకోవాలని మానసిక వేదనకు గురిచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వారు చేసే మానసిక బాధను భరించలేక పోతున్నామని.. వారిద్దరిపై చట్టపరంగా చర్యలు తీసుకొని మా కుటుంబ సభ్యులను కాపాడాలని ఆమె కోరారు.